www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 9 ఆగస్టు 2025

నేటి నుంచి బాస్కెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకూ సిబిఎస్ఇ క్లస్టర్-7 బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు నిర్వహిస్తున్నట్టు శ్రీప్రకాష్ డైరెక్టర్ సిహెచ్.విజయ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 100 పాఠశాలల నుండి 140 టీములు పాల్గొంటున్నాయని, ఈ టీములకు సంబంధించి సుమారు 1500 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరవుతారన్నారు. ఈ పోటీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు. క్రీడాకారులకు వసతి ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు.

ఉపాధ్యాయుల్లేక కళాశాల మూత

- ప్రజల విజ్ఞప్తి మేరకు ఏర్పాటు
- మూతతో విద్యార్థుల అవస్థలు

కోటనందూరులో మూసివేసిన ఇంటర్ కళాశాల

ప్రజాశక్తి-కోటనందూరు

కాకినాడ, అనకాపల్లి జిల్లాలకు సరిహద్దు ప్రాంతమైన కోటనందూరులో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉన్న ఇంటర్మీడియట్ కాలేజీ ఉపాధ్యాయులు లేకపోవడంతో మూతపడింది. మండల కేంద్రమైన కోటనందూరులో ఇంటర్మీడియట్ కాలేజీ ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు, విద్యార్థులు తల్లిదండ్రులు గత 2021 సంవత్సరం నుంచి మాజీ మంత్రి దాడిశెట్టి రాజాను కోరారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారంతో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా 2024-2025 సంవత్సరంలో కోటనందూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఇంటర్మీడియట్ కాలేజ్‌ని ప్రారంభించారు. ఇంటర్‌లో ఎంపిసి, సిఇసి గ్రూపులను ప్రవేశపెట్టారు. ఆ ఏడాదిలో 21 మంది విద్యార్థులు కాలేజీలో జాయిన్ అయ్యారు. కాలేజీ ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం ఉపాధ్యాయులను ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యాబోధన అందిస్తున్న ఉపాధ్యాయులతోనే ఇంటర్మీడియట్ విద్యార్థులకు విద్యాబోధన అందించారు. కోటనందూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ కాలేజీకి ఉపాధ్యాయులను నిర్మించకపోవడం వల్లే వీరిలో 19 మంది ఫెయిల్ అయిపోయారని విద్యార్థులు తల్లిదండ్రుల ఆవేదన చెందుతున్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ కాలేజీని ప్రభుత్వం మూసివేసింది. కాలేజీని మూసి వేయడంతో దూర ప్రాంతాలకు వెళ్లలేక విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ ఇంటర్మీడియట్ కాలేజీలో జాయిన్ అవ్వాలంటే తుని, పాయకరావుపేట, నర్సీపట్నం పట్టణ ప్రాంతాలకు వెళ్లాలంటే 20 నుంచి 25 కిలోమీటర్ల దూరం వెళ్లాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విచారం వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ కాలేజీలకు లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించే ఆర్థిక స్తోమత తమకలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మూసివేసిన ఇంటర్మీడియట్ కాలేజ్ ని మళ్ళీ పునరుద్ధరించాలని విద్యార్థులు తల్లిదండ్రులు స్థానిక ప్రజలు కోరుతున్నారు. హైస్కూల్లో ఏర్పాటు చేసిన కాలేజీ మూసివేయడంపై కోటనందూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జికెఎస్ అప్పారావును వివరణ కోరగా ఉపాధ్యాయులు లేకపోవడం వల్లే విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు జాయిన్ చేయలేదని తెలపారు. మొదటి సంవత్సరం చదివిన విద్యార్థులు కూడా టిసిలు తీసుకుని వెళ్లిపోయారని తెలిపారు.

ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

ఘనంగా చేనేత దినోత్సవం

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

మూలపేటలో చేనేత దినోత్సవ ర్యాలీని చేనేత కార్మికులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మూలపేట రామాలయం నుంచి సచివాలయం వరకు చేనేత కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని, చేనేత పరిశ్రమ నిర్వీర్యం అయిపోతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. చేనేత పనులు లేకపోవడంతో కార్మికులు కూలి పనులకు వెళ్తున్నారని తెలిపారు. చేనేత పరిశ్రమపై జిఎస్‌టి తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్ది నాగేశ్వరరావు, మురళి, బబ్జి, సత్యనారాయణ, సత్తిబాబు, గుంటుకు సత్తిబాబు పాల్గొన్నారు.

సచివాలయాలతో మెరుగైన పాలన

భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి సుభాష్

ప్రజాశక్తి-కాజులూరు

సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సుపరిపాలన అందించడంతో పాటు, అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. శుక్రవారం కాజులూరు మండలం బందనపూడిలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రూ.4.5 లక్షలతో చెత్త నుంచి సంపద తయారు చేసే (ఎస్‌డబ్ల్యుపిసి) షెడ్, రూ.4.28 లక్షలతో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం తగిన నిధులు వెచ్చించి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రజల మౌలిక సదుపాయాలు తీర్చేందుకుగాను నిధులు వెచ్చించి, ప్రజా ప్రతినిధులు, అధికారుల ద్వారా మెరుగైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఏడాది కాలంలోనే రూ.125 కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశామన్నారు. ఇది నిరంతర ప్రక్రియగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఎఇ భవాని శంకర్, గ్రామ సర్పంచ్ డేగల తిరుమలవేణి సత్యనారాయణ, ఆర్యవటం సహకార సంఘం అధ్యక్షులు కోట తాతబ్బాయి, డేగల నాగేంద్ర, గుబ్బల యేసు రాజు, కూటమి పార్టీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సామర్లకోట మండలం కొప్పవరంలోని ఎంపీ సానా సతీష్ బాబు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. పింఛన్లు, విద్య, ఇళ్ల స్థలాలు, ఉపాధి, వైద్యం, తదితరాలకు సంబంధించి అర్జీలు వచ్చాయని కార్యాలయ ఇన్చార్జి మేకా లక్ష్మణమూర్తి తెలిపారు. వాటిలో కొన్ని అర్జీలను అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించినట్టు తెలిపారు. ఎంపీ సతీష్ బాబు సూచన మేరకు కార్యకర్తలకు కూడా ఒక రోజుని కేటాయిస్తూ వారి సమస్యలు కూడా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ న్యూటన్, చింతపల్లి అర్జున్, జున్నూరు బాబ్జి, ఐటిడిపి సతీష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ల పిఎఫ్ వెంటనే చెల్లించాలి

వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న 115 మంది క్లాప్ డ్రైవర్లకు 19 నెలల పిఎఫ్ వెంటనే చెల్లించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. వీరి బకాయి పిఎఫ్ సొమ్ము కార్మికులు ఖాతాకు జమ చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడ బోట్ క్లబ్ ఎదురుగా ఉన్న పిఎఫ్ కార్యాలయంలో పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌కి సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, క్లాప్ వాహన డ్రైవర్ల యూనియన్ కార్యదర్శి శివ శ్రీను వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 జనవరి నెల నుంచి నేటి వరకు క్లాప్ డ్రైవర్ల జీతాల నుంచి స్వయంభు కాంట్రాక్టు సంస్థ వారు పిఎఫ్ సొమ్మును మినహాయించుకుని నేటికీ కార్మికుల పిఎఫ్ ఖాతాకు జమ చేయడం లేదన్నారు. ఎంప్లాయీ, ఎంప్లాయర్ రెండు వాటాలను యాజమాన్యం పిఎఫ్ ఖాతాకు జమ చేయవలసి ఉండగా కార్మికుల జీతాల నుంచి మినహాయించుకున్న సొమ్ము కూడా కనీసం పిఎఫ్ ఖాతాకు జమ చేయకుండా కాంట్రాక్టు సంస్థ తమ వద్ద పెట్టుకోవడం సరైనది కాదన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌కు కూడా విన్నవించామన్నారు. కాంట్రాక్ట్ సంస్థతో మాట్లాడి కార్మికుల ఖాతాకు పిఎఫ్ సొమ్ము జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. 19 నెలల నుంచి పిఎఫ్ కట్టకపోతే కార్మికులు పని చేస్తున్న సమయంలో అనుకోకుండా ప్రమాదం ఏమైనా జరిగి కార్మికులకు ఏదైనా జరిగితే వాళ్ల కుటుంబానికి ఆధారం ఎవరని అధికారులను ప్రశ్నించారు. తక్షణమే ఈ సమస్య పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేయడానికి సిద్ధపడుతున్నామని హెచ్చరించారు.

రోశమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

రోశమ్మకు నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మద్యపాన వ్యతిరేక ఉద్యమంలో దూబగుంట రోశమ్మ చేసిన పోరాట స్ఫూర్తిని మహిళలు అందిపుచ్చుకోవాలని అందరికీ రోశమ్మ ఆదర్శం కావాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్‌సి పేటలో జన విజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో మద్యపాన వ్యతిరేక ఉద్యమ సారథి దూబగుంట రోశమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులు అర్పించారు. మొదటిగా ఆమె చిత్రపటానికి శ్రామిక మహిళలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ కన్వీనర్ నక్క సూర్యనారాయణ మాట్లాడుతూ సారా వ్యతిరేక ఉద్యమం ఉప్పెనగా మారడానికి రోశమ్మ చేసిన పోరాటమే కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల గౌరవ అధ్యక్షులు దాడి పద్మనాభం, అధ్యక్షుడు ఏలేటి నాని బాబు, సారిక వెలుగమ్మ, నాగరత్నం, అప్పలరాజు, శైలు పలువురు మహిళలు పాల్గొన్నారు.

నేడు బాస్కెట్‌బాల్ కోర్టు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక పద్మనాభ కాలనీలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటుచేసిన బాస్కెట్‌బాల్ కోర్టుని ఈ నెల 9వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభిస్తారని హెచ్‌ఎం రవీంద్ర తెలిపారు. శుక్రవారం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ఆధ్వర్యంలో బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవీంద్ర మాట్లాడుతూ శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో ఈ నెల 9న ప్రారంభమయ్యే సిబిఎస్ఇ క్లస్టర్ 7 ఛాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా తమ పాఠశాలలో ఈ బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటు చేశారన్నారు. ఒక విభాగం పోటీలు ఈ నూతన బాస్కెట్‌బాల్ కోర్టులో నిర్వహిస్తారన్నారు.

రోడ్డు నిర్మించారు.. డ్రెయినేజీలు మరిచారు..

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక గౌరీ కోనేరు కాలనీ నుంచి వరహాలయ్య పేట వెళ్లే రహదారిలో 20 ఏళ్ల క్రితం క్వాజా కాలనీ నిర్మించారు. రెండేళ్ల క్రితం ఈ కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మించారు. రోడ్డుకు ఇరువైపులా పూర్తిస్థాయిలో మట్టిని కూడా కప్పలేదు. ముఖ్యంగా రోడ్డు నిర్మించిన తర్వాత డ్రైన్ నిర్మించకపోవడంతో అనేక ప్రదేశాలలో ఇళ్లల్లోని వాడకం నీరు ప్రవహించే దారి లేక ఒకే చోట ఉండిపోయి మురికి గుంటలుగా తయారయ్యాయి. దీనివల్ల ఈ కాలనీ దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు విపరీతంగా పెరిగిపోయి ఈ కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. వెంటనే తమ కాలనీలో డ్రైన్ నిర్మించాలని కాలనీ వాసులు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

నిరుపేదలకు అండగా ఎంఎంఆర్ ట్రస్ట్

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

నియోజకవర్గంలో నిరుపేదలకు అండగా ఎంఎంఆర్ ట్రస్ట్ అండగా ఉంటుందని ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ధర్మవరం గ్రామానికి చెందిన కేదారి శేఖర్ తల్లి మంగ ఇటీవల చేతికి శస్త్ర చికత్స చేయించుకోవడంతో మంగకు రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, దొడ్డిపట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, విద్యుత్ సర్‌ఛార్జీల పేరుతో ప్రజలపై వేస్తున్న భారాలను ఉపసంహరించుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సర్ ఛార్జీలు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చి వాటిని రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాలు మోపే కూటమి ప్రభుత్వ విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. గతంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలు కొట్టాలని చెప్పి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ద్వారాలు తెరిసిందన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రక్రియను ఉపసంహరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఎం కార్యదర్శి పాకలపాటి సోమరాజు, కన్వీనర్ రొంగల ఈశ్వరరావు, నాయకులు పిల్ల రాంబాబు, రౌతు సత్యనారాయణ, వి.దొంగబాబు, జి.నూకరాజు, ఎన్.సత్యవతి, బి.వెంకటలక్ష్మి, వి.మంగ, వి.లక్ష్మి, కె.రత్నం ఉన్నారు.

భారతీయ సంస్కృతికి చేనేత ప్రతీక



చేనేత కార్మికుని సన్మానిస్తున్న కొల్లు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-కాజులూరు

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు చేనేత ప్రతీక అని పెనుమల్ల సహకార సంఘం అధ్యక్షుడు కొల్లు వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండల కేంద్రమైన కాజులూరులో జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పెనుమల్ల సహకార సంఘం అధ్యక్షుడు కొల్లు వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశంలోని చేనేత కార్మికుల కృషికి గుర్తింపు ఇవ్వడం ద్వారా వారు ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని చేనేత రంగాన్ని ప్రోత్సహించడం, హస్తనిర్మిత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించడం, యువతలో చేనేత రంగం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఆగస్టు 7వ తేదీని ఎంపిక చేయడం వెనుక ఒక చారిత్రక కారణం ఉందన్నారు. 1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమం ప్రారంభమైందనీ ఇది బ్రిటిష్ ఉత్పత్తులను బహిష్కరించి, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు భారతీయులు ప్రారంభించారని తెలిపారు. చేనేత రంగం కూడా ఈ ఉద్యమంలో కీలకపాత్ర వహించిందన్నారు. మొదటి జాతీయ చేనేత దినోత్సవం మొదటిసారి 2015లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా జాతీయ చేనేత దినోత్సవాన్ని జరిపిందన్నారు. చేనేత రంగం గ్రామీణ భారతదేశానికి ముఖ్యమైన ఉపాధి మార్గంగా ఉందని తెలిపారు. చేనేత వస్త్రాలు పర్యావరణహితమైనవని, ఆకర్షణీయమైనవని తెలిపారు. మన చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం ద్వారా చేనేత కార్మికుల జీవితాల్లో మార్పు తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువులు చేనేత కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికుల సంఘం అధ్యక్షులు కుసున్నరి రామకృష్ణ, బొడ్డు వీర కృష్ణ, బండారు సత్యనారాయణ, కవితరపు గోవిందు, గోపి సత్తిబాబు, గోపి పిల్లా రాయుడు, లొల్ల గిరి, లొల్ల వెంకటరమణ పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-కాకినాడ

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలు సెప్టెంబర్ 31, అక్టోబర్ 1న జగ్గంపేటలో నిర్వహించనున్నట్టు ఎపి బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు తెలిపారు. కచేరి పేట సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు చెక్క రాజ్ కుమార్ మాట్లాడుతూ 2021లో అప్పటి సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 1214 మెమో ద్వారా భవన నిర్మాణ కార్మికులకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్యులు జారీ చేసిందన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న పవన్ కల్యాణ్, చంద్రబాబు జగన్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ కార్మికుల పోరాటాల్లో పాల్గొని అధికారంలోకి రాగానే అన్ని తిరిగి ప్రారంభిస్తానని మేనిఫెస్టోలో పేర్కొన్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తికావొస్తున్నా నేటికీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. పైగా కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వ ఖజానా నుండి ఒక్క రూపాయి ఖర్చు లేకపోయినా, కార్మికులు దాచుకున్న సొమ్ము రూ.3 వేల కోట్లు బోర్డులో మూలుగుతున్నా కూటమి ప్రభుత్వం, నాయకులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సహనాన్ని పరీక్షించే కాలం ముగిసిపోయిందని, ఇక పోరాటాలకు కార్మికులను సిద్ధం చేయడం కోసమే ఈ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోరా సత్తిబాబు, కొల్లి సత్తిబాబు, వానపల్లి శివ, ఆకుల సత్యన్నారాయణ, బేడిశెట్టి వెంకట రమణ, రాము, కుంచే చిన్న, కండి బాబి, కెంగం బుజ్జి, చంద్రమళ్ల పద్మ పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా నిఘా నిర్వహించిన ప్రాంతం

డ్రోన్ కెమెరాతో నిఘా

ప్రజాశక్తి - జగ్గంపేట

అసాంఘిక కార్యక్రమాలపై అనుమానిత ప్రాంతాల్లో పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. శుక్రవారం జగ్గంపేట శివారు పుష్కర, పోలవరం కాలవ గట్టు ఏరియాలోను, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ వెనక ప్రాంతాలలో డ్రోన్‌ల ద్వారా నిఘా చేపట్టారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు.

టిటిడి ద్వారా విగ్రహాలు అందించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

సామర్లకోట రూరల్ మండలం నవర గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి విగ్రహాలను అందించాలని టిటిడి బోర్డు సభ్యులు, ఎమ్‌ఎల్‌ఎ జ్యోతుల నెహ్రూను ఆ గ్రామస్తులు కోరారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కాకినాడ రూరల్ టిడిపి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ సిద్ధి నూకరాజు, రామదేవ సీతయ్య దొర, తదితరులు ఎంఎల్‌ఎను స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిటిడి నుంచి వెంకటేశ్వర స్వామి నూతన విగ్రహాలు అందించాలని నెహ్రూను కలిసి కోరారు. ఈ కార్యక్రమంలో కేశవరపు సత్యనారాయణ, మేడిపోయిన వీర్రాజు, సిద్ధి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

బికెఎస్ నియోజకవర్గ అధ్యక్షునిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - జగ్గంపేట

భారతీయ కాపు సేన జగ్గంపేట నియోజకవర్గ అధ్యక్షునిగా కురుమళ్ల నాగేశ్వరరావు నియమితులయ్యారు. బికెఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కాలవ వెంకటేశ్వరరావు నాగేశ్వరరావుపై తనపై నమ్మకం ఉంచి నియోజకవర్గ అధ్యక్షునిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, తదితరులు అభినందించారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని సామర్లకోట శ్రీకుమార రామ భీమేశ్వరాలయ నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతున్నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన కార్యవర్గానికి దరఖాస్తు చేసుకునే వారు దేవాదాయ శాఖ చట్టంలో నిర్ణయించిన ప్రొఫార్మా-2ను అనుసరించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 20 రోజుల గడువు లోపు ఆశక్తి గల వారు దరఖాస్తులు ఆలయాల పని వేళల్లో సంప్రదించి దరఖాస్తులు అందించాలని ఈ సందర్భంగా ఇఒ నీలకంఠం తెలిపారు.

పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియామకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. ధర్మకర్తలుగా ఉండేందుకు ఆసక్తిగల, అర్హత కలిగిన అభ్యర్థులు 20 రోజుల్లోగా తమ దరఖాస్తులను మరిడమ్మ దేవస్థానం కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలు దేవస్థానం కార్యాలయంలో తెలుసుకోవచ్చన్నారు. పెద్దాపురం మండలం తిరుపతిలో శృంగార వల్లభ స్వామి ఆలయానికి నూతన ధర్మకర్తల మండలి నియామకానికి అర్హులైన ఆసక్తిగల వారు నేటి నుండి 20 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు

సమావేశంలో మాట్లాడుతున్న సతీష్ రెడ్డి

ప్రకృతి పరిరక్షణకు వృక్షాబంధన్

ప్రజాశక్తి గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వృక్షాబంధన్ వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత వృక్షా బంధన్‌కు ప్రాముఖ్యత ఇచ్చి ప్రకృతిని పరిరక్షించాలని పిలుపు ఇచ్చారు. నేడు రాఖీ పౌర్ణమి పర్వదినం రక్షా బంధన్ సందర్భంగా ముందుగా అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి పేరుతో అడవులను నరికి కాంక్రీట్ జంగిల్ పెంచుకుంటూ ప్రకతిని ధ్వంసం చేయడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వర్షాభావ పరిస్థితులు, ఉష్ణోగ్రతలో పెను మార్పులు సంభవిస్తున్నాయని తెలిపారు. సోదర బంధానికి ప్రతీక అయిన రక్షా బంధన్ నుంచి ప్రతి ఒక్కరూ తమ సోదరుల పేర ఒక మొక్కను నాటి ప్రకతి పరిరక్షణకు తద్వారా పచ్చని పర్యావరణాన్ని భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్స్ డాక్టర్ ఎస్. రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, రిజిస్ట్రార్ జి.సురేష్, ఆదిత్య టి.హబ్ సిఇఒ బాబ్జి నీలం, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పౌర్ణమి సందర్భంగా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం జరిపారు. అనంతరం అమ్మవారికి బంగారు, వెండి పూలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ పులిహార ప్రసాద వితరణ చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు ఐవి.ప్రసాద్ శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ, జి.క్రాంతి, వరహాలు, శివ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

డివైడర్ పైకి దూసుకెళ్లిన కంటైనర్

డివైడర్ పైకి దూసుకెళ్లిన కంటైనర్

ప్రజాశక్తి - గోపాలపురం

కంటైనర్ అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఈ ఘటన గోపాలపురంలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ నుంచి దేవరపల్లి మండలంలోని ఒక ఫ్యాక్టరీ వద్దకు ఊక లోడుతో వస్తున్న కంటైనర్ లారీ గోపాలపురం వైఎస్ఆర్ జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి డివైడర్ పైకి ఎక్కి నిలిచిపోయింది. డ్రైవర్ నిద్రమత్తే దీనిక కారణంగా భావిస్తున్నారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది, స్థానికులు చాకచక్యంగా లారీని అక్కడి నుంచి దించి పంపించారు.

ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-కాజులూరు

బైక్ అదుపు తప్పి గాయపడిన ఒక యువకుడు మృతి చెందాడు. స్థానికులు చెప్పిన వివరాలు ప్రకారం అయితపూడి గ్రామానికి చెందిన పడాల సంతోష్ కుమార్ (22) పొలానికి వెళుతూ బైకు అదుపు తప్పడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు సంతోష్ తండ్రికి సమాచారం అందించడంతో ఆయన హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కాకినాడ రాఘవ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో సంతోష్ కుమార్ ఆసుపత్రిలో మరణించాడని వారు తెలిపారు. కేసును గొల్లపాలెం ఎస్ఐ మోహన్ కుమార్ దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలో రాజవరం, పేరవరం గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్‌తోపాటు, మూడు మండలాల ఎస్ఐలు, ఇతర సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రికార్డులు లేని 20 వాహనాలతోపాటు, 20 లీటర్ల సారతో ఒక మహిళను అరెస్టు చేశారు. 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ తనిఖీల్లో రికార్డు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటికి ఉన్న రికార్డు చూపిస్తే తిరిగి ఇస్తామని లేదంటే బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగిస్తామని సిఐ విద్యాసాగర్ తెలిపారు. ఈ తనిఖీలలో ఆత్రేయపురం, కొత్తపేట, ఆలమూరు ఎస్ఐలు రాము, సురేంద్ర, నరేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గృహం ధ్వంసం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గ్యాస్ సిలెండర్ లీకై సంభవించిన ఘటనలో ఒక గృహం ధ్వంసమైంది. దీనికి సంబంధించి స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక మూడవ వార్డు పరిధిలోని చింతలమెరక గ్రామంలో మట్టపర్తి ప్రసాదుకు చెందిన ఇంటిలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇంటిలోని బంగారు ఆభరణాలు, విలువైన దస్తావేజులు, స్కూలు సర్టిఫికేట్లు దహనం అయ్యాయని, సుమారు రూ.3.50 లక్షల వరకూ ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

చోరీ జరిగిన ఇల్లు

ములికిపల్లిలో ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - రాజోలు

ములికిపల్లి గ్రామాల్లో తాళాలు వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఇంటి యజమాని కట్టా వెంకటలక్ష్మి ఈ నెల 7వ తేదీన ఏలూరులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లింది. 8వ తేదీ ఉదయం పని మనిషి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఈ విషయం యజమాని వెంకటలక్ష్మికి ఫోన్ చేసి చెప్పింది. ఆమె వచ్చి చేసేసరికి ఇంటి తలుపులు లోపల ఉన్న బీరువా తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయి. దొంగతనం జరిగింది అని గ్రహించిన వెంకటలక్ష్మి పోలీసులకు సమాచారం అందించింది. సంఘటనా స్థలాన్ని సిఐ నరేష్‌కుమార్ పరిశీలించారు. క్యూస్ టీమ్ రంగంలో దిగి వేలిముద్రలు సేకరించింది. బీరువాలో ఉన్న రూ.ఐదు లక్షల నగదు, ఆరు కాసుల బంగారు గాజులు చోరీ కి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

చోరీ కేసు దర్యాప్తు ముమ్మరం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఇటీవల చేందుర్తి జంక్షన్ వద్ద ఆభరణాల చోరీ కేసుపై ఎఎస్పి మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో సిఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నలుగురు ఎస్ఐలతో కూడిన బృందాలతో పోలీసులు దర్యాప్తు ముమ్మరంగా చేపట్టారు. నిందితుల కోసం అనేక కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. సిసి పుటేజీ, సెల్ టవర్ ఆధారంగా చోరీలో ఐదుగురు నిందితులు పాల్గొన్నట్టు పోలీసులు గుర్తించారు.

అరుదైన పుష్పాల పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

అరుదుగా లభించే శివలింగ పుష్పాలను స్థానిక శెట్టిబలిజిపేటకు చెందిన పాలిక అప్పారావు శుక్రవారం పలువురికి పంపిణీ చేశారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని జగ్గంపేటలోని పురవీధుల్లో తిరిగి ఇంటింటికీ ఉచితంగా పూజలకు కావాల్సిన మారేడు, జమ్మి, తులసి, నేరేడు, వివిధ రకాల పత్రులను అందజేశారు. ఆయనను పలువురు అభినందించారు.

ఉపాధి లేక మేకప్ కళాకారుల అవస్థలు

ప్రజాశక్తి-పెద్దాపురం

ఒకప్పుడు పౌరాణిక, సాంఘిక నాటక రంగం, అమ్మ తల్లులు, గ్రామ దేవతల జాతరలు ముమ్మురంగా జరిగే కాలంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలలో మేకప్ కళాకారులకు చేతి నిండా పని ఉండేది. పౌరాణిక, సాంఘిక నాటక రంగాలు కనుమరుగయ్యాయి, అప్పుడప్పుడూ పరిషత్తు నాటక పోటీలు మాత్రమే దర్శన మిస్తున్నాయి. ప్రస్తుతం గ్రామ దేవతల జాతరలు మాత్రమే మేకప్ కళాకారులకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ తరుణంలో ఏడాది పొడవునా పని లేక అనేకమంది మేకప్ కళాకారులు ఈ వృత్తి నుండి తప్పుకుని వేరే వత్తుల్లో స్థిరపడిపోతున్నారు. ప్రస్తుతం కొంతమంది కళాకారులు మాత్రమే కాకినాడ, రాజమండ్రి ప్రాంతాలలో మేకప్ కళాకారులుగా మిగిలారు.

మేకప్ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

మేకప్ కళాకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రాజమండ్రి హేమ డ్రెస్ కంపెనీకి చెందిన మేకప్ ఆర్టిస్ట్ బుర్రే నాగేంద్రబాబు అన్నారు. స్థానిక మరిడమ్మ అమ్మవారి జాతరలో భాగంగా స్థానిక వరహాలయ్యపేట వాసులు ఆదివారం నిర్వహిస్తున్న మరిడమ్మ సంబరంలో బండ్ల వేషాల పాత్రదారులకు మేకప్ చేసేందుకు వచ్చిన ఆయన

మేకప్ చేస్తున్న నాగేంద్రబాబు

మాట్లాడుతూ గ్రామ దేవతల జాతరలలో బళ్ల వేషాలు ఏర్పాటు చేసినప్పుడు మాత్రమే తమకు పని ఉంటోందన్నారు. ఇటీవల కాలంలో అన్ని గ్రామాల్లో గ్రామదేవతల జాతరలు నిర్వహిస్తున్నా బండ్ల వేషాలు తగ్గించి వేస్తున్నారన్నారు. వరహాలయ్య పేట సంబరంలో మూడు వేషాల బండ్లు మాత్రమే ఏర్పాటు చేయటం వల్ల ఇద్దరం మాత్రమే మేకప్ చేస్తున్నామన్నారు. కొన్ని జాతర సంబరాలలో పది నుండి 20 వరకు వేషాల బండ్లు ఏర్పాటు చేసే వారన్నారు. వేషాల బండ్ల డెకరేషన్, లైటింగ్‌కు వ్యయం ఎక్కువ అవడంతో ప్రస్తుతం ఈ సంఖ్యను ఒకటి నుండి మూడు బండ్లకు తగ్గించి వేయడంతో తమకు పూర్తి స్థాయిలో ఉపాధి లభించడం లేదన్నారు. పౌరాణిక నాటకాలు పూర్తిగా కనుమరుగయ్యాయన్నారు. ఈ తరుణంలో మిగిలి ఉన్న మేకప్ కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 50 ఏళ్ల వయసు నిండిన కళాకారులకు పింఛన్ ఇవ్వాలని, అన్ని సంక్షేమ పథకాలూ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాచీన జానపద సంస్కృతిలో అంతర్భాగమైన జాతరలు అమ్మవారుల సంబరాలలోనే నేటికీ జానపద సంస్కృతి జానపద కళారూపాలు దర్శనమిస్తున్నాయి. పుల్ల మత ధనిక పేద అనే తారతమ్యాలకతీతంగా ప్రజలందరూ ఈ జాతర సంబరాలలో పాల్గొంటున్నారు గ్రామదేవతల జాతరలో ప్రాచీన జానపద కళారూపాలు ప్రోత్సహించకపోతే జానపద కళా రూపాలు, కళా సంస్కృతి పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి

ప్రజాశక్తి -కరప

ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కోరుపల్లిలో భారతరత్న ఫాదర్ ఆఫ్ గ్రీన్ రెవల్యూషన్ అవార్డు గ్రహీత ఎంఎస్ స్వామినాథన్ జయంతి ఎపి కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎకరానికి ఐదు నుంచి పది బస్తాలు మాత్రమే పండేవి ఎమ్మెస్ స్వామినాథన్ దేశ భవిష్యత్తును మార్చేందుకు వరి, గోధుమ వంగడాలపై పరిశోధనలు చేసి ఆకలి కేకలను దూరం చేశారు. నేడు మనదేశంలో ప్రజలందరికీ ఆహార ధాన్యాలు సరిపడా పండించడమే కాక విదేశాలకు ఎగుమతి చేసే విధంగా ఆహార పంటలను అభివృద్ధి చేశారన్నారు. 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం స్వామినాథన్ ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటు చేసిందని, ఆ కమిషన్‌లో క్వింటా ధాన్యానికి రూ.2,000 ఖర్చు అవుతుంది కాబట్టి మరో 50 శాతం అదనంగా కలిపి ఆహార పంటలకు ఇవ్వాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సులు చేశారన్నారు. ఆ తరువాత ఆయన కుమార్తె జయతీ ఘోష్ కమిషన్ కూడా అప్పుడే నియమించారని తెలిపారు. ఆ కమిషన్ కూడా అదే చెప్పిందన్నారు. నేటికీ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు జరగడం లేదని, ఒక్క కేరళలో మాత్రమే కమిషన్ సిఫార్సులు అమలు చేస్తున్నారని తెలిపారు. దేశమంతా ఆ కమిషన్

స్వామినాథన్‌కు నివాళులర్పిస్తున్న రైతులు

సిఫార్సులు అమలు జరిపి ఉంటే నేడు రైతు ఆత్మహత్యలు జరిగేవి కాదన్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలు పెరుగుతున్నాయని, కానీ రైతుల పండించే పంటల ధరలు పెరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతుల సంఘం నాయకులు నులుకుర్తి నాగేశ్వరరావు, పేంకే సత్యనారాయణ పెంకే నారాయణ, రెడ్డి భద్రం, అప్పాడ బూరయ్య, దెయ్యాల తాతాజీ, కాదా సత్యనారాయణ, రెడ్డి పెదకాపు, పెంకే వెంకటరమణ, పెంకే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - సామర్లకోట

కూటమి ప్రభుత్వంలోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట పెద్దపులి చెరువు వద్ద నుంచి సాయి నగర్‌కు వెళ్ళే రోడ్డును కలుపుతూ పంచాయితీరాజ్, ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.50 లక్షలతో నిర్మిస్తున్న రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోనే నిజమైన అభివృద్ధి జరుగుతున్నట్టు చెప్పారు. మారుమూల ప్రాంతాల్లో సైతం రహదారుల నిర్మాణాన్ని చేపట్టడం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. కోటమ్మ ప్రభుత్వం అందించే అభివద్ధిని ప్రజలు గుర్తించాలన్నారు. కాదా రహదారి నిర్మాణాన్ని నాణ్యతాపరంగా ఎలాంటి రాజీ లేకుండా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే జగదీశ్ మోహన్ (బాబు), సామర్లకోట సొసైటీ అధ్యక్షుడు పైన శ్రీనివాసరావు, పడాల వీరబాబు, వల్లూరి దొరబాబు, పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పివి.రామకృష్ణయ్య, మండల ఇంజనీర్ యువై.రత్నం, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, ప్రతిభ పాఠశాల డైరెక్టర్ ఎస్‌వివిజి.ప్రకాష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ఆదిత్యలో హర్ ఘర్ తిరంగా

ప్రజాశక్తి-కాకినాడ

ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, కాకినాడ జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించినట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 2 నుండి 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ప్రతి భారతీయ పౌరుడి గుండెల నిండా దేశభక్తి ఉండాలని, ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యత భావాలను కలిగి ఉండాలన్నారు. ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాలపై జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను సెట్రాజ్ సిఇఒ కెఎస్‌వి.కాశీ విశ్వేశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జి మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, డి.అశ్విని పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కొత్తపేట, ఆత్రేయపురం

కొత్తపేట మండలంలోని మందేశ్వర స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి డి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ఫారం-11 ప్రకారం ఆలయ కార్యాలయానికి ఈ ప్రకటన వెలువడిన 20 రోజులలోపు దరఖాస్తులను అందజేయాలని కోరారు. పాలకమండలి సభ్యులు కావాలనే వారిపై ఎటువంటి క్రిమినల్ కేసులు ఉండరాదని, ఇతర సమాచారం కోసం ఆలయ కార్యాలయం అధికారులను సంప్రదించాలని సూచించారు. అలాగే ఆత్రేయపురం మండలంలోని ర్యాలీ గ్రామంలో ఉన్న జగన్మోహిని కేశవ మరియు గోపాల స్వామి దేవస్థానం ధర్మకర్త మండలి నియమానిక దేవాదాయ ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి భాగవతుల వెంకటరమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటన వెలువడిన 20 రోజులలోపు పాలకమండలి సభ్యుడిగా పోటీ చేసేందుకు దరఖాస్తులను ఆలయ కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.

మండపేట విలీనంపై 10న సమావేశాలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ ఈ నెల 10న కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ కామన ప్రభాకర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయా మండలంలోని అన్ని పార్టీల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మేథావులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు మండలంలోని అంగరలో ఉన్న వీర వెంకటసత్యనారాయణ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఉంటుందని, అలాగే సాయంత్రం 4 గంటలకు రాయవరం మండలంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మరో సమావేశం ఉంటుందన్నారు.

భీమేశ్వరాలయ అర్చకుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానం అనువంశిక వంశపారంపర్య ప్రధాన అర్చకులు కళ్లేపల్లి ఫణికుమార్(83) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆలయ ప్రధాన ద్వారాన్ని మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూసి వేశారు. ఆయన మృతికి ఆలయ ఇఒ అల్లు దుర్గభవాని, ఆలయ సిబ్బంది, అర్చకులు సంతాపం తెలిపారు.

సామూహిక వరలక్ష్మి కుంకుమ పూజలు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

అంతర్వేది లక్ష్మి నార సింహస్వామి ఆల యంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు.రాజ్యలక్ష్మి తాయారు అమ్మ వారికి శ్రావణ మాసం మూడో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో పాల్గొన్న వారికి అమ్మవారి రూపు, పూజ సామాగ్రిని ఆలయ అధికారులు ఉచితంగా అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకెటిఎన్‌వి.వీప్రసాద్ పర్యవేక్షించారు.

ఎపిపికి పలువురి అభినందనలు

ప్రజాశక్తి - ఆలమూరు

రామచంద్రపురం 13వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు అడిషనల్ పిపిగా నియమితులైన కప్పల సునీల్ కుమార్‌ను పలువురు అభినం దించారు. శుక్రవారం ఆల మూరులో ఆయనను పలు రాజకీయ పార్టీలకు చెందిన మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, సాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి నాయకులు నెల్లి చిన్న, టిడిపి నాయకులు ఇ.రాంబాబు, ఇ.నల్లబాబు, మానేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న తోటరాజు

వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధం : తోట రాజు

ప్రజాశక్తి - యానాం

రాబోయే యానాం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమైనట్టు ప్రముఖ వ్యాపారవేత్త తోట రాజు ప్రకటించారు. స్థానిక ఫెర్రీ రోడ్డులోని గాజుల గార్డెన్స్‌లో తోట ఫాలోవర్స్ ఆధ్వర్యంలో నా తొలి అడుగు మీతోనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటరాజు మాట్లాడుతూ రాజకీయాల్లోకి రావడానికి గల కారణాలను ప్రజలకు వివరించారు. యానాం నియోజకవర్గం ప్రజలకు సేవలను అందించాలని లక్ష్యంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించినట్టు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ప్రజల ఆశీస్సులతో ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేస్తానని అన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఐదు సమస్యలపై తాను పోరాడుతానన్నారు. ఇళ్ల పట్టాలు, పారిశుధ్యం, సాగు తాగునీరు, కుటీర పరిశ్రమల స్థాపన, మత్స్యకార సమస్యలపై మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ముందుగా తోటరాజు ఫాలోవర్స్, అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోటరాజు ఫాలోవర్స్, పరిసర ప్రాంతాలకు చెందిన యువత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలపై పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - యానాం

తీగలపై గురుమూర్తి మృతదేహం

విద్యుత్ తీగలపై పడి యువకుడు మృతి చెందిన సంఘటన యానాంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఐ.పోలవరం మండలం కేసనకుర్రు గ్రామానికి చెందిన చింతా గురుమూర్తి (22) తన మిత్రులతో కలిసి స్థానిక ఫెర్రీ రోడ్డులోని కూనంరెడ్డి గార్డెన్స్‌లో ఒక పుట్టినరోజు వేడుకకు వచ్చాడు. బిల్డింగ్ పైనుంచి విద్యుత్ తీగలపై పడి మృతి చెందాడన్నారు. మృత దేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రిలో ఫ్రీజర్లు అందజేస్తున్న బృందం

ప్రభుత్వాసుపత్రికి ఫ్రీజర్ల అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

కెటిసి విద్యా సంస్థల అధినేత చక్రవర్తి పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి మన పెద్దాపురం ఫేస్బుక్ బందం ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రీజర్లు అందజేశారు. ఈ సందర్భంగా చక్రవర్తిని మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదాంబ, మన పెద్దాపురం ఫేస్బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్, ఆనంద్, సతీష్ కుమార్, నెక్కల భుజంగరావు, వడ్డి సత్యనారాయణ, హైదర్ ఆలీ, నాగలక్ష్మి, జి.ఉమా శేఖర్, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలపై పిచ్చి మొక్కలు

-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై పిచ్చి మొక్కలు వృక్షాలుగా మారుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో పలు ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. ఒక భవనంలో కింద మండల స్వయం సహాయక సంఘం (డ్వాక్రా) కార్యాలయం, పై అంతస్తులో గ్రామ సచివాలయం-2 కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఈ భవనంపై రావి మొక్కలు మొలిచాయి. సుమారు రెండు-మూడు సంవత్సరాలుగా మొక్కలు పెరుగుతూ ఉన్నాయి. ఆ కార్యాలయానికి చెందిన అధికారులు, సిబ్బంది యథావిధిగా విధులు నిర్వర్తించుకుని వెళ్లివస్తున్నారు. కానీ వారు విధులు నిర్వర్తించే భవనంపై భాగాన మొక్కలు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే ప్రస్తుతం స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న పాత మండల పరిషత్ కార్యాలయంపైనా రావి మొక్కలు దర్శనమిస్తున్నాయి.

ప్రభుత్వ కార్యాలయ భవనాలపై మొక్కలు

మొక్కలు పెరిగి వృక్షాలుగా మారుతున్నప్పటికీ అధికారి యంత్రాంగం వాటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మొక్కలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మారని పేర్లు..తొలగని ఫోటోలు..

ప్రజాశక్తి - దేవరపల్లి

ప్రభుత్వం మారినా...పథకాల పేర్లు మారినా..ఉన్నతాధికారుల ఆదేశాలు ఇచ్చినా స్థానిక అధికారులు అలసత్వంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వైసిపి పాలనలో రైతుల సంక్షేమం కోసమంటూ రైతు బరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చుతూ వ్యవసాయ శాఖా ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు వచ్చి నెలలు గడుస్తున్నా ఆ ఆదేశాలు అమలుకు నోచుకోలేదు. ఆఖరికి గత ప్రభుత్వ నాయకుల ఫోటోలను సైతం తొలగించుటంలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని కూటమి నాయకులు విమర్శిస్తున్నారు. మండలంలో పలు సచివాలయాల వద్ద రైతు భరోసా

పేరు మార్చని రైతు భరోసా కేంద్రం

కేంద్రాలుగానే నడుస్తున్నాయి. నేటికీ ఆయా కేంద్రాల వద్ద బోర్డులు రైతు భరోసా కేంద్రాలుగానే దర్శనమిస్తున్నాయని, తక్షణమే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పేర్లు మార్చాలని కూటమి నాయకులు కోరుతున్నారు.

నిబంధనలతో ఈక్రాప్ నమోదు చేయలేం

ప్రజాశకి-కాజులూరు

ప్రభుత్వ నిబంధనలతో ఇక్రాప్ నమోదు చేయలేమని వ్యవసాయ శాఖ సహాయకులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కాజులూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి అశోక్‌కు ఈ క్రాప్ నిబంధనలపై గ్రామ వ్యవసాయ శాఖ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయకులు కిషోర్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలతో నమోదుకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయన్నారు. గత సంవత్సరం ఈ క్రాప్ నమోదు చేయాలంటే సుమారు 300 మీటర్ల వరకు సేద్యం చేసే భూమి వద్ద నుండి నమోదు అయ్యేదని, 25 సెంట్లు అయితే ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నమోదు చేసేవారన్నారు.గర్భిణులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని, పంట నమోదు సమయంలో భద్రత లేకుండా ఉందన్నారు. దీంతో గతంలో పాము కరిచి ఒకరు చనిపోయారని తెలిపారు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం కలిగే మొబైల్ గాని ట్యాబ్ గాని అందించాలని, గరిష్ట దూరం 300 మీటర్ల వరకు ఉంచాలని, 25 సెంట్ల భూమికి ఎటువంటి నిబంధనలు విధించకూడదని, బీడు భూములు అంతర పంటలు ఉన్న ప్రాంతాల్లో ద్వారా సర్వే చేయాలని కోరారు. గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు అనివిల్లి ప్రకాష్, దుర్గాప్రసాద్, కిషోర్ నాయుడు, అనిత, పవన్ కుమార్, సత్య ప్రసన్న పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని భీమనపల్లి పంచాయతీ భట్టుపాలెంకు చెందిన ఆకేటి లక్ష్మీసింధు కు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కును ఆమె తండ్రి నాగేశ్వరరావుకు ఎంఎల్ఎ ఆనందరావు శుక్రవారం అందజేశారు. లక్ష్మీ సింధు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఈ విషయాన్ని ఎంఎల్ఎ ఆనందరావు దృష్టికి భీమనపల్లి సహకార సొసైటీ అధ్యక్షులు ఆకేటి శ్రీనివాస్ తీసుకువెళ్లారు. దీంతో ఆయన సిఎం సహాయనిధికి రిఫర్ చేశారు. సిఎంఆర్ఎఫ్ నుంచి విడుదలైన రూ.37,465 ఎల్ఒసి మంజూరు పత్రాన్ని ఎంఎల్ఎ ఆమె తండ్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆనందరావుకు లబ్ధిదారు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మహారాజశ్రీ కాకినాడ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP.389/2024 OS.No.1007/2019
Between:-
రెడ్నం వెంకట సుబ్బారావు ...DHR
And
సుంకర త్రిలేఖ@ కంచుస్తంభం త్రిలేఖ వగైరా ...JDRS
To.
అక్కిరెడ్డి పద్మలత W/o.త్రినాద్ Rep by GPA Holder మునగల శేషమాంభ దేవిW/o.రమేష్. 2-16A-8 శిరంగు వారి వీధి, వెంకటనగర్, కాకినాడ. ...JDR2
పై నెంబరు అమలులో గ్రందములో or 21 R64 & 66 నోటీసులు పై 2వ JDR అయిన మీ హాజరు నిమిత్తం వాయిదా **11-08-2025** కాబట్టి మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల వాయిదా తేదీ ఉదయం గం౹౹ **10.30** ని౹౹ల్కు పై కోర్టు ఎదుట హాజరయి తెలుపుకోవలెను.
వాయిదా.11-08-2025
ఓరుగంటి సుదాకర్
యం.యుగేషు
కాకినాడ అడ్వకేట్సు
04-08-25 సెల్.9441143021

మహారాజశ్రీ కాకినాడ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP.388/2024 OS.No.1008/2019
Between:-
దిండి రాధాకృష్ణ ...DHR
And
సుంకర త్రిలేఖ@ కంచుస్తంభం త్రిలేఖ వగైరా ...JDRS
To.
అక్కిరెడ్డి పద్మలత W/o.త్రినాద్ Rep by GPA Holder మునగల శేషమాంభ దేవిW/o.రమేష్. 2-16A-8 శిరంగు వారి వీధి, వెంకటనగర్, కాకినాడ. ...JDR2
పై నెంబరు అమలులో గ్రందములో or 21 R64 & 66 నోటీసులు పై 2వ JDR అయిన మీ హాజరు నిమిత్తం వాయిదా **11-08-2025** కాబట్టి మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల వాయిదా తేదీ ఉదయం గం౹౹ **10.30** ని౹౹ల్కు పై కోర్టు ఎదుట హాజరయి తెలుపుకోవలెను.
వాయిదా.11-08-2025
ఓరుగంటి సుదాకర్
యం.యుగేషు
కాకినాడ అడ్వకేట్సు
04-08-25 సెల్.9441143021